క్లుప్తంగా

రూ.50 వేల ఆర్థిక సాయం

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్‌కు చెందిన ఎం.వెంకన్న అనారోగ్యంతో ఇటీవల మృతి చెందగా.. ఆయనతో పని చేసే తోటి డ్రైవర్లు కుటుంబానికి ఆర్థిక చేయూతనిచ్చారు. శనివారం గ్రానైట్ లారీ డ్రైవర్‌గా పనిచేసే వెంకన్నకు తోటి డ్రైవర్లు కలిసి రూ.50 వేలు శనివారం కుటుంబసభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రానైట్ అసోసియేషన్ అధ్యక్షుడు చిందేటి ఉపేంద్రరావు, ఉపాధ్యక్షుడు బండారు మధుకర్, సురేష్, రాజు, రాజేష్, రాము, వెంకటేష్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు కలెక్టరేట్ ముట్టడి..

నేలకొండపల్లి: విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేయనున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు పి.సుధాకర్ తెలిపారు. నేలకొండపల్లిలో ప్రభుత్వ పాఠశాలల సమస్యలపై విద్యార్థులను కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నాక ఆయన మాట్లాడారు. తక్షణమే గురుకులాలు, వసతి గృహాల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రేపటి కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు దాసు, చరణ్, గణేష్, నవీన్, వంశీ, నాగుల్‌మీరా, వెంకటరెడ్డి, రేణుక, కృష్ణవేణి, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడి జన్మదిన వేడుకలు

ఖమ్మంఅర్బన్: టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో నాయకులు కేతినేని హరీష్, కొండబాల కరుణాకర్, మామిళ్ల కోటేశ్వరరావు, చుండూరు రాజరాజేశ్వరి, మల్లెంపాటి అప్పారావు, వాసిరెడ్డి భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ..

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్ నాయకుడు ముస్తఫా తల్లి మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఖమ్మంలోని ముస్తఫా నివాసానికి శనివారం వెళ్లిన నాయకులు ఆమె మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ టి.దయాకర్‌రెడ్డితో పాటు బాణాల లక్ష్మణ్, దుంపల రవికుమార్, షేక్ ఇమామ్, మొగిలిచర్ల సైదులు, కాంపాటి వెంకన్న, మెండె వెంకటేష్‌యాదవ్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల 5కే రన్



5కే రన్‌లో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు

ఖమ్మంరూరల్: మండలంలోని నాయుడుపేట నుంచి వరంగల్ క్రాస్‌రోడ్ వరకు పాలేరు నియోజవర్గ ఓట్ ఫర్ ష్యూర్ 5కే రన్‌ను అధికారులు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఓటు ప్రాధాన్యతను తెలియజేస్తూ దాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో ఓటర్లకు ఈవీఎం సహాయంతో అవగాహన కల్పించారు. అనంతరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజేశ్వరి మాట్లాడుతూ..తాము వేసిన ఓటు తామనుకున్న వారికే పోల్ అయిందా లేదా అనే విషయాన్ని తెలుసుకునేందుకు ఓటర్లకు అవగాహన కలిగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్లు, సీఐ రాజిరెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని 26వ డివిజన్ సుగ్గల వారి తోట, రామకృష్ణ నగర్‌లో చేపట్టిన సీసీ డ్రెయిన్ల నిర్మాణ పనులను మేయర్ పునుకొల్లు నీరజ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా శివాలయం వీధిలో రాతి కట్టడాల డ్రెయినేజీకి మరమ్మతులు చేయిస్తానని స్థానికులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ పునుకొల్లు రామబ్రహ్మం, డివిజన్ నాయకులు గౌతంబాబా, రామయ్య, హరి, వర్క్ ఇన్‌స్పెక్టర్ సతీష్, జవాన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి సర్కిల్‌లో పెరిగిన టెండర్లు

నేలకొండపల్లి: నూతన మద్యం పాలసీలో భాగంగా టెండర్ల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం ముగిసింది. ఈమేరకు నేలకొండపల్లి సర్కిల్‌లో గతంతో పోలిస్తే ఈసారి టెండర్లు పెరిగాయి. నేలకొండపల్లి సర్కిల్‌లోని 15 దుకాణాలకు 954 టెండర్లు వచ్చాయి. గత పాలసీలో 746 టెండర్లు రాగా, ఈసారి 208 టెండర్లు పెరగడంతో రూ.19 కోట్ల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. కాగా, సర్కిల్‌లోని ముదిగొండ మండలం వల్లభి వైన్స్‌కు అత్యధికంగా 139 టెండర్లు, తక్కువగా కూసుమంచి మండలం జీళ్లచెరువు వైన్స్‌కు 40 టెండర్లు నమోదయ్యాయి. ఈసందర్భంగా నేలకొండపల్లి ఎక్సైజ్ సీఐ కె.పోశెట్టి శనివారం మాట్లాడుతూ వ్యాపారులను ప్రోత్సహించడంతో పాటు పరిచయాల ద్వారా టెండర్లు పెరిగేలా కృషి చేశామని తెలిపారు.



సంప్రదాయ సాగుతో విసిగిపోయిన రైతులు.. తక్కువ శ్రమతో దీర్ఘకాలం పాటు లాభాలు తెచ్చిపెట్టే పంటల వైపు మొగ్గుచూపుతున్నారు. మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న డ్రాగన్ ఫ్రూట్ (గులాబీ పండు) సాగును ఎంచుకొని మంచి ఆదాయం పొందుతున్నారు. ఇప్పటి వరకు సాగు చేసిన రైతులు పెద్ద పెద్ద నగరాల్లోని మాల్స్‌లో, గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల వెంట వరకు విక్రయాలు విస్తరించాయి. పత్తి, మిర్చి తదితర వాణిజ్య పంటలకు అధిక పెట్టుబడులతో పాటు ప్రకృతి కూడా సహకరించినప్పుడే రైతులకు గిట్టుబాటు అవుతుంది. దీంతో రైతులు ఆ పంటలను వదిలి కూరగాయలు, పండ్ల తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు.

గులాబీ పండు.. లాభాలు మెండు

అల్లీపురంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు.. భలే బాగు

- నగరాల్లోనే కాక గ్రామస్థాయి వరకూ విస్తరించిన అమ్మకాలు
- కేజీ రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్న వైనం
- ఒక్క సాగుతో ఏళ్లపాటు దిగుబడి
- ప్లేట్‌లెట్స్ మెరుగవుతాయని పలువురి కొనుగోళ్లు

సండే స్పెషల్





అల్లీపురంలో రైతు సాగు చేసిన డ్రాగన్ తోట, (ఇన్‌సెట్) డ్రాగన్ పండ్లు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 15వ డివిజన్‌కి చెందిన రైతు ఏపూరి వెంకటేశ్వరరావు నగరానికి సమీపాన ఉన్న అల్లిపురంలోని తన వ్యవసాయ భూమిలో గతంలో పత్తి, మిర్చి, మొక్కజొన్న తదితర పంటలను సాగు చేశారు. ఇప్పుడు 10 ఎకరాలకుపైగా పామాయిల్ తోట, మూడు ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశాడు. పామాయిల్ పంట దిగుబడి వస్తుండగా.. గత కొన్ని మాసాలుగా డ్రాగన్ ఫ్రూట్ కూడా చేతికందుతుంది. ఈ ఫ్రూట్‌ను పండించిన పలు ప్రాంతాల్లో పరిశీలించిన తర్వాత ఉద్యాన అధికారుల సూచనల మేరకు సాగు చేసినట్లు రైతు తెలిపారు. మొక్కల అంటు నుంచి వాటి స్తంభాల ఏర్పాటు, పెంపకానికి ఎకరానికి సుమారు రూ.7 లక్షలు ఖర్చు వస్తుందని రైతు తెలిపారు. సాగు చేసిన ఏడాది నుంచి పంట చేతికందనుండగా.. ప్రస్తుతం పంట దిగుబడి జూన్ నుంచి నవంబర్ వస్తుందన్నారు.

ఎప్పటికప్పుడే అమ్మకాలు..

జిల్లాలో డ్రాగన్ ఫ్రూట్ సాగు కొద్దిమంది మాత్రమే చేయడంతో అత్యధికంగా పండించే సూర్యాపేట తదితర ప్రాంతాల నుంచి ఖమ్మంకు దిగుమతి చేసుకుంటున్నారు. స్థానికంగా పండిన పంట మొత్తం అక్కడ వినియోగదారులు కొనుగోళ్లకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కాగా, ఇప్పటికే పెట్టుబడిలో 75శాతం మేర చేతికందిందని, కూలీల అవసరం కూడా చాలా తక్కువ ఉంటుందని చెప్పారు. స్తంభాలు, మొక్కలు వేసినప్పుడు మాత్రమే కూలీలు ఎక్కువ కావాలని, కాయలు కోసే సమయాన ఒకరిద్దరు అవసరం ఉంటుందని, పాదు చేయడానికి ట్రాక్టర్లను వినియోగిస్తున్నట్లు రైతు పేర్కొన్నాడు. కాగా, దశల వారీగా పంట చేతికందడంతో ఏ రోజుకు ఆరోజు కోసి అమ్ముతున్నట్లు తెలిపారు. ప్లేట్‌లెట్స్ మెరుగుపరిచేందుకు ఈ ఫ్రూట్ ఉపయోగపడుతుండడంతో కారోనా కాలం నుంచి ఈ ఫ్రూట్‌కు బాగా డిమాండ్ పెరిగింది. దీంతో ఎక్కువ మంది కావాలని కార్లు, బైక్‌లపై వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

కేజీ రూ.100కు పైమాటే..

డ్రాగన్ ఫ్రూట్‌లో మూడు రకాలైన అమెరికన్ బ్యూటీ, తైవాన్ పింక్, సీఎం రెడ్ వంటి వాటిని సాగు చేస్తారు. వ్యాపారులకు అమ్మడంతో పాటు వినియోగదారులు సైతం తన వద్దకు కొంటానికి వస్తారని, అయినా వ్యాపారుల ధరలకే అమ్ముతున్నట్లు చెప్పారు. కేజీ రూ.100 నుంచి రూ.150 వరకు ధర పలుకుతుందని, ఒక్కసారి పెట్టుబడి పెడితే ఏళ్లపాటు పంట చేతికందుతుందని తెలిపారు. ఇటీవల వర్షం ముసురుతో కొంత మచ్చ వచ్చిందని, లేదంటే ఫ్రూట్ ఎంతో నాణ్యతతో దిగుబడి వస్తుందని వివరించారు.

కూలీల అవసరం తక్కువ..



మూడెకరాల్లో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశా. మొదటిలో పెట్టుబడి భారంగా ఉన్నా.. పంట చేతికందిన తర్వాత అంతగా ఉండదు. కూలీల అవసరం కూడా తక్కువే. సేంద్రియ ఎరువులను వాడుతున్నాం. చీడలకు మాత్రం అవసరం మేరకు మందు పిచికారీ చేస్తుంటాం. పొలం, ఇంటి దగ్గరకు వచ్చి వినియోగదారులు, వ్యాపారులు కొంటున్నారు.

– ఏపూరి వెంకటేశ్వరరావు, రైతు

ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ బోధన



మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీనివాస్

ఖమ్మంఅర్బన్/రఘునాథపాలెం: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందించడమే కాక మధ్యాహ్న భోజనం, రాగిజావ పంపిణీతో పిల్లలకు పౌష్టికాహారం అందుతోందని ఎంఈఓ ఎం.శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని వీ.వీ.పాలెం పాఠశాలలో శనివారం ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ వసతులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు కూడా చొరవ చూపాలని కోరారు. కాంప్లెక్స్ హెచ్ఎం శ్రీదేవి, ఇన్‌చార్జ్ హెచ్ఎం రాయల నర్సింహారావు, ఉపాధ్యాయిని నర్మద తదితరులు పాల్గొన్నారు. అలాగే, నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం జెడ్పీహెచ్ఎస్‌లో జరిగిన సమావేశంలో కార్పొరేటర్ కూరాకుల వలరాజు మాట్లాడుతూ పదో తరగతిలో 10 జీపీఏ సాధించే విద్యార్థులకు రూ.10 వేల ప్రోత్సాహక బహుమతి అందజేస్తానని ప్రకటించారు. హెచ్ఎం మల్లెల వెంకటేశ్వర్లు మాట్లాడగా, ఎస్ఎంసీ చైర్మన్ గూటి శ్రీనివాసరావుతో పాటు మొర్రిమేకల కోటయ్య, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు

ఖమ్మంమయూరిసెంటర్: కళాశాలల్లో విద్యను అభ్యసించే యువత క్రమశిక్షణతో ఉండాలని, చెడు వ్యసనాలకు బానిస కావొద్దని టూటౌన్ సీఐ స్వామి సూచించారు. శనివారం నగరంలోని గిరిజన సంక్షేమ శాఖ కళాశాల బాలుర వసతిగృహాల్లో విద్యార్థులకు చెడు వ్యసనాలకు బానిస కావడం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమాధికారి హనుమంతరావు, సిబ్బంది పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యాన చలో కలెక్టరేట్



ప్రదర్శన నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ శ్రేణులు

ఖమ్మంమయూరిసెంటర్: విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ శనివారం పీడీఎస్‌యూ జిల్లా కమిటీ ఆధ్వర్యాన చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. ప్రదర్శనగా పీడీఎస్‌యూ కార్యకర్తలు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నామాల ఆజాద్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను దూరం చేసే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా పూర్తిగా యూనిఫామ్‌లు ఇవ్వలేదన్నారు. విద్యారంగ సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే రోజుల్లో విద్యుర్థులే ప్రభుత్వానిక బుద్ధి చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, డివిజన్ కార్యదర్శి లక్ష్మణ్, డివిజన్ నాయకులు వినయ్, కార్తీక్, శ్రీకాంత్, ఉమామహేశ్వరి, గణేష్, సాయి, వంశీ, తరుణ్, మురళి తదితరులు పాల్గొన్నారు.

'పీఎం శ్రీ'లో 16 పాఠశాలల ఎంపిక

నేలకొండపల్లి: పీఎం శ్రీ పథకం రెండో విడతలో నేలకొండపల్లి మండలంలోని 16 పాఠశాలలు ఎంపికయ్యాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఐదేళ్ల పాటు నిధులు కేటాయించి అభివృద్ధి చేసేందుకు కేంద్రప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. మొదటి విడతలో మండలంలోని సింగారెడ్డిపాలెం సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల ఎంపిక కాగా, రెండో విడతలో 16పాఠశాలలను గుర్తించారు. ఈమేరకు రాయగూడెం, చెరువుమాధారం, శంకరగిరితండా, బైరవునిపల్లి, పైనంపల్లి, బోదులబండ, చెన్నారం, గువ్వలగూడెం, బోదులబండ, మంగాపురంతండా, కోనాయిగూడెం, రాజేశ్వరపురం, సింగారెడ్డిపాలెం, నాచేపల్లి, నేలకొండపల్లి, ఆరెగూడెం పాఠశాలల వివరాలు పంపాలని అందిన ఆదేశాలతో హెచ్ఎంలు నివేదిక రూపొందిస్తున్నారు.

పంటల నమోదు పకడ్బందీగా చేపట్టాలి



మాట్లాడుతున్న ఏడీఏ విజయచంద్ర

కూసుమంచి: వానాకాలం పంటల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని కూసుమంచి ఏడీఏ విజయచంద్ర సూచించారు. శనివారం కూసుమంచిలోని రైతు వేదికలో నిర్వహించిన ఏఈఓల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 11వ వ్యవసాయ గణనను త్వరితగతిన పూర్తిచేయాలని, ప్రతి మంగళ, శుక్రవారాల్లో రైతు వేదికల్లో రైతులకు శిక్షణలను అందించాలన్నారు. పంటల నమోదు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, రైతుల సమస్యలను దృష్టికి వచ్చిన వెంటనే పరిష్కారమయ్యేలా చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఓలు వాణి, సీతారాంరెడ్డి, నాగేశ్వరరావు, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం..



పాపారావును సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

ఖమ్మం మామిళ్లగూడెం: ప్రముఖ వైద్యుడు, బీజేపీ జిల్లా నాయకుడు డాక్టర్ శీలం పాపారావు పుట్టినరోజు సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ ఆధ్వర్యాన శనివారం ఆస్పత్రిలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా గల్లా మాట్లాడుతూ.. అతి తక్కువ ఖర్చుతో నిరుపేదలకు వైద్యం అందిస్తూ ఆశా జ్యోతిగా నిలిచారని అన్నారు. డాక్టర్ పాపారావు మాట్లాడుతూ.. తమ తల్లి జ్ఞాపకార్థంగా అతిత్వరలో శీలం లక్ష్మి పేరుతో ట్రస్ట్‌ను ప్రారంభించి నిరుపేదలకు ఉచితంగా శస్త్ర చికిత్సలు అందించనున్నట్లు తెలిపారు. అనంతరం అన్నం సేవా ఫౌండేషన్, దుర్గా భవాని ఆశ్రమంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు మంద సరస్వతి, చావాకిరణ్, డీకొండ శ్యామ్, భద్రం, లక్ష్మీనారాయణ గుప్త, కుమిలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ డీడీకి..



శాలువాతో సత్కరిస్తున్న ఫోరమ్ బాధ్యులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉత్తమ జిల్లా అధికారిగా ప్రశంసాపత్రం పొందిన ఎస్సీ సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కస్తాల సత్యనారాయణను శనివారం తెలంగాణ వసతిగృహ సంక్షేమాధికారుల ఫోరమ్ ఐడీఓసీలోని ఆయన చాంబర్‌లో సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీహెచ్‌డబ్ల్యూఓస్ ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు కోటపాటి రుక్మారావు, కార్యదర్శి ఎస్.నాగేశ్వరరావు, అసోసియేటెడ్ అధ్యక్షుడు ఎం.వీరయ్య, కల్చరల్ సెక్రటరీ ఎస్.విజయ, ఈసీ మెంబర్ ఎం.వెంకటకృష్ణయ్య, హెచ్‌డబ్ల్యూఓ పి.హనుమంతరావు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి అమ్మ ట్రస్ట్ చేయూత

నేలకొండపల్లి: మండలంలోని నాచేపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగుడు చిలకల కృష్ణకు ఉండడానికి ఇల్లు, చూసుకోవడానికి ఎవరూ లేక ఇబ్బంది పడుతుండడంతో శనివారం అమ్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు అండగా నిలిచారు. వర్షానికి తడుస్తున్న విషయం తెలుసుకుని సభ్యులు ప్రత్యేకంగా పట్టాలతో నీడ కల్పించి, ఇంట్లోకి వరద నీరు రాకుండా మట్టిని పోశారు. అంతేకాక వైద్యఖర్చులు అందజేశారు.

సాధించుకున్న తెలంగాణలో వెనకబాటు



పీజీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ నాయకుల ధర్నా

ఖమ్మం మామిళ్లగూడెం: కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో వెనుకబాటుకు గురికావాల్సి వస్తుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని డిమాండ్‌తో పీజీ కళాశాల ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా యూనివర్సిటీకి కావాల్సిన అన్ని వసతులు ఉన్నప్పటికీ వివక్షత ఎందుకు చూపిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో యూనివర్సిటీ ఏర్పాటు చేసి విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. యూనివర్సిటీ ఏర్పాటు కోసం దశలవారిగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు నాగులుమీరా, చందులాల్, నరేష్, వెంకటేశ్, ప్రశాంతి, స్వరూప, స్వాతి, కీర్తివేదన, నాగరాజు, కల్యాణ్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా టీఎన్జీవోస్



సమావేశంలో మాట్లాడుతున్న అఫ్జల్‌హసన్

ఖమ్మం సహకారనగర్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అండగా ఉండి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు షేక్.అఫ్జల్‌హసన్ పేర్కొన్నారు. శనివారం నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరిగే ఉద్యోగ సంఘాల సమావేశంలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ సాగర్, రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు తుంబూరు సునీల్‌రెడ్డి, తెలంగాణ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం కో ఆర్డినేటర్ ఖాజావియా, టీఎన్జీవోస్ మాజీ అధ్యక్షులు కూరపాటి రంగరాజుతో పాటు లక్ష్మణ్, శ్రీధర్, బిందు ప్రసాద్, ప్రవీణ్, వినోద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల కమిటీ ఎన్నిక..

ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా బి.వినోద్, కార్యదర్శిగా పి.ప్రవీణ్‌కుమార్, ట్రెజరర్‌గా ఎండీ మహమూద్ అలీ, ఈసీ మెంబర్లుగా చందు, శేషు, మున్ని, నిస్సి తస్లీ, యాకుబ్ పాషాలను ఎన్నుకున్నారు.

బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న రామకృష్ణ

ఖమ్మం మామిళ్లగూడెం: జనసేన పార్టీ ఖమ్మం నియోజకవర్గానికి చెందిన క్రియాశీలక సభ్యురాలు షేక్.నజీమాకు రూ.50వేల నగదును ప్రమాద బీమా చెక్కును శనివారం ఆ పార్టీ ఖమ్మం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మిరియాల రామకృష్ణ శనివారం గట్టయ్య సెంటర్‌లో అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సూరజ్‌కిరణ్, నగర అధ్యక్షుడు మేడబోయిన కార్తిక్, ప్రధాన కార్యదర్శి అజయ్ కృష్ణ, ఉపాధ్యక్షులు దేవేందర్, ఫయాజ్, శ్రీకాంత్, ఉపేందర్, స్రవంత్, నగర మహిళా అధ్యక్షురాలు విజయకుమారి, విద్యార్థి సంఘ నాయకులు ప్రభాకర్, గాంగాధర్, రాకేష్, చారి, ఉదయ్, లికేష్, కల్యాణి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పంట బీమా అమలు చేయాలి

ఖమ్మం మామిళ్లగూడెం: రైతులకు రుణమాఫీతో పాటు నేటి వరకు అయిన వడ్డీని రద్దు చేయాలని అఖిల భారత ప్రగతి శీల రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మలీదు నాగేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంట బీమా పథకాన్ని అమలు చేయాలని, కౌలు రైతులను గుర్తించి రైతులకు వర్తించే ప్రభుత్వ పథకాలను వారికీ అమలయ్యేలా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు గుర్రం అచ్చయ్య, ఆవుల వెంకటేశ్వర్లు, నాగేశ్వరావు, అప్పారావు, నాగిరెడ్డి, మారుతి, మల్లయ్య, వెంకన్న, లక్ష్మి నర్సయ్య, వి.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు దళితబంధు ఇవ్వాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట నాయకుల ధర్నా

కూసుమంచి: అర్హులైన దళితులందరికీ దళితబంధు పథకాన్ని వర్తింపజేయాలని, గృహలక్ష్మి పథకంలో దళితులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరుతూ కేవీపీఎస్ ఆధ్వర్యాన శనివారం ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి నందిపాటి మనోహర్ మాట్లాడుతూ.. దళితవాడల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టి ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాపిట్ల సత్యనారాయణ, నాయకులు వేణు, నవీన్, రామనాథం, రాజ్‌కుమార్, మంజునాథ, రమేష్, కార్తీక్, సంధ్య, శ్రావణ్, లలిత పాల్గొన్నారు.

కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయాలి

తిరుమలాయపాలెం: కొత్త రేషన్ కార్డులను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా నాయకుడు ఎర్రా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. శనివారం తిరుమలాయపాలెంలో గజ్జల వెంకటయ్య భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వివిధ స్కీంల పేరుతో అనేక పథకాలను ప్రవేశ పెడుతున్న నేపథ్యాన రేషన్‌కార్డులకు ప్రభుత్వ పథకాలకు ముడిపడి ఉన్నందున వెంటనే కార్డులు మంజూరు చేయాలని, సాదాబైనామా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు బషీరుద్దీన్, పార్టీ మండల కార్యదర్శి శ్రీను, నాయకులు నర్సయ్య, సురేష్, తుల్లూరి నాగేశ్వరరావు, వెంకన్న, వెంకటేష్, వీరన్న తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు ఆవిష్కరణ

నేలకొండపల్లి: మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 26, 27 తేదీల్లో నిర్వహించే తిరు కల్యాణ మహోత్సవాన్ని విజయవంతం చేయాలని దేవాలయం కార్యనిర్వహణాధికారి పి.నారాయణచార్యులు కోరారు. శనివారం ఈమేరకు మండల కేంద్రంలోని దేవాలయంలో తిరుకల్యాణానికి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. మహోత్సవ విజయవంతం కోసం దేవాలయం కమిటీ విస్తృతంగా ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్చకులు తూపురాణి మధుసూధనాచార్యులు, భక్తులు పలువురు పాల్గొన్నారు.

'ఎస్‌బీఐటీ'లో ఫేర్‌వెల్ డే



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న చైర్మన్ కృష్ణ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో 2021బ్యాచ్ ఎంబీఏ విద్యార్థుల ఫేర్‌వెల్ డే వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటివరకు తమ కళాశాలలో విద్యార్థులకు నేర్పిన విద్యాబుద్ధులు, క్రమశిక్షణ సమాజం అభివృద్ధి చేసేందుకు దోహదపడాలని సూచించారు. తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించగా విద్యార్థులు చేసిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ జి.ధాత్రి, ప్రిన్సిపాల్, డాక్టర్ జి.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ గంధం శ్రీనివాసరావు, అకాడమిక్ డైరెక్టర్లు డాక్టర్ ఏ.వీ.వీ శివ ప్రసాద్, జి.ప్రవీణ్‌కుమార్, డాక్టర్ జి.సుభాష్‌చందర్, డాక్టర్ జె.రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం..

ఫొటోలతో జ్ఞాపకాలు భద్రంగా ఉంచుకోవచ్చని పలువురు వక్తలు అన్నారు. శనివారం ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవ వేడుకల సందర్భంగా పలు మండలాల్లో ఫొటో అండ్ వీడియో గ్రాఫర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఫొటో, వీడియోగ్రాఫర్లు ఫొటోగ్రఫీ పితామహుడు లూయిస్ దాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. కాగా, ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఫొటోగ్రాఫర్లకు శుభాకాంక్షలు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



ఖమ్మంరూరల్: ఫొటోగ్రాఫర్లతో ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి



తిరుమలాయపాలెం: కేక్ తినిపించుకుంటున్న ఫొటోగ్రాఫర్లు